వైభవంగా వసంత పంచమి

- సరస్వతీ దేవికి లక్ష పుష్పార్చన
- అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి, అదనపు ఎస్పీ మహేందర్

శివ్వంపేట చాకరిమెట్లలో సరస్వతీదేవిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి

ఏడుపాయల్లో వనదుర్గామాత

మెదక్ మండలంలోని పెరూరులో సరస్వతీ మాతను దర్శించుకున్న అదనపు ఎస్పీ మహేందర్

శివ్వంపేట మండలంలోని చాకరిమెట్ల ఆంజనేయస్వామి ఆలయ సత్యనారాయణస్వామి వ్రత మండపంలో వసంత పంచమి సందర్భంగా సరస్వతీదేవికి ఫౌండర్ చైర్మన్ ఆంజనేయశర్మ ఆధ్వర్యంలో లక్షపుష్పార్చన చేశారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి హాజరై సరస్వతీదేవికి పూజలు చేశారు. మహిళలు పెద్ద సంఖ్యలో హాజరై ప్రత్యేక పూజల్లో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. వసంత పంచమిని పురస్కరించుకుని పాపన్నపేట మండలంలోని ఏడుపాయల్లో కొలువైన వనదుర్గామాత చదువుల తల్లి సరస్వతీ దేవీ రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు

గరుడగంగ సరస్వతీసేవలో అదనపు ఎస్పీ మహేందర్

మెదక్ మండలం పేరూరు శివారులోని మంజీరా తీరంలో ఉన్న గరుడగంగ సరస్వతీ మాత ఆలయంలో అదనపు ఎస్పీ మహేందర్ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. చేగుంట, నార్సింగి, రామాయంపేట, నిజాంపేట, చిలిపిచెడ్, మెదక్, వెల్దుర్తి, ఆయా మండలాల్లోని ఆలయాల్లో వైభవంగా వసంత పంచమి వేడుకలను నిర్వహించారు.

- న్యూస్ నెట్‌వర్క్, మెదక్ జిల్లా

సీసీరోడ్లు, మురుగు కాల్వల నిర్మాణానికి నిధులు మంజూరు

నర్సాపూర్, ఫిబ్రవరి 3: నర్సాపూర్ నియోజకవర్గంలోని 172 గ్రామాల్లో ఎస్సీ కాలనీల్లో మురుగు కాల్వలు, సీసీ రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరైనట్లు ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. జీవో ఆర్టీ నెం 78 ద్వారా రూ.10 కోట్ల 4 లక్షలు మంజూరైనట్లు పేర్కొన్నారు. నర్సాపూర్ నియోజకవర్గ అభివృద్ధికి అహర్నిషలు కృషి చేస్తానని, మరిన్ని నిధులు తీసుకొచ్చి అభివృద్ధికి పాటుపడుతానన్నారు.

శిథిలావస్థలో అంగన్‌వాడీ కేంద్రం

శివ్వంపేట, ఫిబ్రవరి 3: మండలంలోని లింగోజిగూడ గ్రామంలో శిథిలావస్థకు చేరిన అంగన్‌వాడీ కేంద్రాన్ని డీడబ్ల్యూవో హైమావతి, సీడీపీవో హేమభార్గవి సోమవారం పరిశీలించారు. అంగన్‌వాడీ కేంద్రంలో పెచ్చులూడుతున్నాయన్న గ్రామస్తుల విజ్ఞప్తి మేరకు సురక్షితమైన భవనంలోకి తరలించాలని సూచించారు. వారితో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సంతోష, అంగన్‌వాడీ టీచర్ కవిత, పంచాయతీ కార్యదర్శి ఉన్నారు.

అడవి పందిని ఢీకొని వ్యక్తికి తీవ్ర గాయాలు

క్షతగాత్రుడు మహేశ్

నిజాంపేట, ఫిబ్రవరి 3: అడవి పంది ఢీకొన్న వ్యక్తికి తీవ్ర గాయాలైన ఘటన నందిగామ శివారులో సోమవారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మద్దూరు మహేశ్ నిజాంపేట నుంచి రామాయంపేట వైపు వెళ్తున్న క్రమంలో నందిగామ శివారులోకి రాగానే అకస్మాత్తుగా అడవి పంది రోడ్డుపైకి వచ్చి బాధితుడి బైక్‌ను ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో బైక్ అదుపు తప్పింది. మహేశ్ రోడ్డుపై బలంగా పడడం తో తలకు తీవ్రగాయాలయ్యాయి. సమయానికి చేరుకున్న 108 అంబులెన్స్ సిబ్బంది చికిత్స నిమిత్తం మహేశ్‌ను సిద్ధిపేట ప్రభుత్వ దవాఖానకు తరలించారు. ఘటనా స్థలానికి ఏఎస్సై జైపాల్‌రెడ్డి చేరుకుని విచారణ చేపట్టారు.

రేగోడ్ తహసీల్దార్‌గా దత్తారెడ్డి

రేగోడ్, ఫిబ్రవరి 3: నూతన తహసీల్దార్‌గా దత్తారెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ప్రజలకు అందుబాటులో ఉండి మండలంలోని భూమి, ఇతర సమస్యలను పరిష్కరిస్తామన్నారు.

తల్లీకుమారుడి అదృశ్యం

రామాయంపేట, ఫిబ్రవరి 3: మండలంలోని లక్ష్మాపూర్ గ్రామంలో తల్లీ కుమారుడు అదృశ్యమైన ఘటన వెలుగుచూసింది. రామాయంపేట ఎస్సై బాలరాజు కథనం ప్రకారం.. మండలంలోని లక్ష్మాపూర్ గ్రామానికి చెందిన అనుముల యాదమ్మ(30), కుమారుడు రిత్విక్ (10) జనవరి 29వ తేదీన ఇంట్లో నుంచి వెళ్లిపోయారు. అప్పటి నుంచి కుటుంబీకులు బంధువులు, తెలిసిన వారి వద్ద వెతికినా ఎలాంటి ఆచూకీ లభించలేదు. దీంతో మహిళ తల్లి భాగవ్వ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

సజావుగా ఇంటర్ ప్రాక్టికల్స్

మెదక్ మున్సిపాలిటీ, ఫిబ్రవరి 3: జిల్లా వ్యాప్తంగా ఇంటర్ ప్రాక్టికల్స్ సోమవారం సజావుగా జరిగాయని నోడల్ అధికారి మాధవి తెలిపారు. తొలి రోజు రెండు విడతల్లో 13 పరీక్షా కేంద్రాల్లో జరిగిన ప్రాక్టికల్స్‌కు జనరల్ 575 మందికి 517 మంది, ఒకేషన్‌లో విభాగంలో 338 మందికి 306 మంది విద్యార్థులు హాజరయ్యారు. 90.14శాతం హాజరు శాతం నమోదైంది.

మాజీ ఎమ్మెల్సీకి ఘన నివాళి

కొల్చారం, ఫిబ్రవరి 3: మండలంలోని వరిగుంతం గ్రామానికి చెందిన మాజీ ఎమ్మెల్సీ ఆర్.సత్యనారాయణ ఇటీవల మృతిచెందాడు. సోమవారం సంగారెడ్డి జిల్లా మల్కాపూర్‌లో ఆయన దశదిన కర్మ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాజీ జడ్పీటీసీ ముత్యంగారి మేఘమాల సంతోష్ కుమార్, చిన్నారం ప్రభాకర్, పైతర రవితేజరెడ్డి, ఆది సత్యనారాయణ, ఆది లక్ష్మయ్య, కన్నయ్యవాల్ల గోవర్ధన్ తదితరులు హాజరై నివాళులర్పించారు.

ఎమ్మెల్సీ ఎన్నికలకు సహకరించాలి

- కలెక్టర్ రాహుల్‌రాజ్
- నిజాంపేటలో పోలింగ్ కేంద్రాలను సందర్శించిన కలెక్టర్
- జిల్లా వ్యాప్తంగా పట్టభద్రులు-22, ఉపాధ్యాయులు-22 పోలింగ్ కేంద్రాలు

పోలింగ్ కేంద్రాలను పరిశీలిస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

నిజాంపేట, ఫిబ్రవరి 3: ఎమ్మెల్సీ స్థానానికి పోటీ చేసే అభ్యర్థులు ఎన్నికలకు సహకరించాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ అన్నారు. సోమవారం నిజాంపేట ఉన్నత పాఠశాలలో 2 (పట్టభద్రులు-1, ఉపాధ్యాయులు-1) పోలింగ్ కేంద్రాలను సందర్శించారు. తాగునీరు, టాయిలెట్స్, గదుల్లో ఫాన్స్, ట్యూబ్ లైట్స్ వంటి కనీస వసతులను పరిశీలించారు. జిల్లా వ్యాప్తంగా పట్టభద్రులకు-22, ఉపాధ్యాయులకు -22 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఆయన వెంట తహసీల్దార్ సురేశ్‌కుమార్, ఆర్ఐ ఇమాద్, కంప్యూటర్ ఆపరేటర్ శ్రీకాంత్, సర్వేయర్ ప్రశాంత్, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

మాజీ ఎమ్మెల్యే దంపతులకు ఆహ్వానం

నిజాంపేట, ఫిబ్రవరి 3: చల్మెడలోని రేణుకా ఎల్లమ్మ ఆలయంలో ఈ నెల 11న అమ్మవారి కల్యాణ మహోత్సవాన్ని గౌడ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించనున్నారు. కార్యక్రమానికి రావాలని మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి దంపతులను సంఘం సభ్యులు హైదరాబాద్‌లోని వారి నివాసంలో సోమవారం కలిసి ఆహ్వాన పత్రిక అందజేశారు. బీఆర్ఎస్ నాయకుడు భాస్కర్‌రావు, మాజీ ఎంపీటీసీ నాళం కిష్టాగౌడ్, గౌడ సంఘం సభ్యులు ఎల్లాగౌడ్, తిర్మల్‌గౌడ్, లక్ష్మణ్‌గౌడ్ ఉన్నారు.

ఆలిండియా పోలీస్ సౌత్ జోన్ క్రీడలకు సాయికుమార్

- ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి

మెదక్ అర్బన్, ఫిబ్రవరి 3: ఆలిండియా పోలీస్ సౌత్ క్రీడలకు మెదక్ జిల్లా కానిస్టేబుల్ సాయికుమార్ ఎంపికైనట్లు ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి సోమవారం తెలిపారు. హైదారాబాద్‌లో జరిగిన రాష్ట్ర పోలీస్ క్రికెట్ టీం ఎంపికలో 33 జిల్లాలకు చెందిన పోలీస్ క్రీడాకారులు దాదాపు 250 మంది పాల్గొన్నారని, అందులో మెదక్ జిల్లాకు చెందిన కానిస్టేబుల్ సాయికుమార్ ఎంపికయ్యారని పేర్కొన్నారు. ఈ నెల 7 నుంచి 12వ తేదీ వరకు బెంగళూరులో నిర్వహించనున్న క్రికెట్ టోర్నీలో పాల్గొంటారన్నారు.

అర్జీదారుల సమస్యలు పరిష్కరించాలి

అర్జీదారుల సమస్యలు త్వరగా పరిష్కరించాలని ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి అధికారులకు ఆదేశించారు. జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ఎస్పీ ఆధ్వర్యంలో ప్రజావాణి నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ఫిర్యాదులు స్వీకరించారు.

రైతుభరోసా ఇచ్చేదెప్పుడు?

మాట్లాడుతున్న యాదాగౌడ్, మైసయ్య యాదవ్

శివ్వంపేట, ఫిబ్రవరి 3: రైతుభరోసా డబ్బులు ఎప్పుడిస్తారని రైతు రక్షణ సమితి జిల్లా అధ్యక్షుడు యాదాగౌడ్, గౌరవాధ్యక్షుడు మైసయ్య యాదవ్ ప్రభుత్వాన్ని పశ్నించారు. వారు మాట్లాడుతూ రైతుల విషయంలో ప్రభుత్వం మాట తప్పిందన్నారు. రైతుభరోసా రెండు పంటల నగదును ఒకేసారి చెల్లించాలని డిమాండ్ చేశారు. రుణమాఫీ ఇంకా కాలేదన్నారు. అనంతరం కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు వెంకటేశ్, శ్రీశైలం యాదవ్, జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ మదర్, సలహాదారుడు చంద్రశేఖర్, సభ్యులు ఎల్లంయాదవ్, పరశురాములు ఉన్నారు.

ముదిరాజ్‌లంతా ఐక్యంగా ఉండాలి

ఎమ్మెల్సీ, ముదిరాజ్ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు బండా ప్రకాశ్ ముదిరాజ్


పెద్దమ్మ ఆలయ ప్రారంభోత్సవంలో ఎమ్మెల్సీ బండా ప్రకాశ్ ముదిరాజ్

మనోహరాబాద్, ఫిబ్రవరి 3: ముదిరాజ్‌లంతా ఐక్యంగా ఉండాలని ఎమ్మెల్సీ, ముదిరాజ్ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు బండా ప్రకాశ్ ముదిరాజ్ అన్నారు. మనోహరాబాద్ మండలం కాళ్లకల్‌లో నిర్మిస్తున్న పెద్దమ్మ తల్లి ఆలయ ప్రారంభోత్సవానికి ఆయన హాజరయ్యారు. కార్యక్రమంలో ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొట్టాల యాదగిరి, మండల అధ్యక్షుడు దాసరి నరేశ్ ముదిరాజ్, గ్రామాధ్యక్షుడు మల్లేశ్, మాజీ ఎంపీటీసీ నత్తి లావణ్య, మాజీ సర్పంచ్‌లు నత్తి మల్లేశ్ ముదిరాజ్, నాగభూషణం, భిక్షపతి పాల్గొన్నారు.

విద్యుత్ అంతరాయం లేకుండా తగిన ఏర్పాట్లు

మెదక్, ఫిబ్రవరి 3 (నమస్తే తెలంగాణ): జిల్లాలో ఫిబ్రవరి, మార్చి, ఏప్రిల్, మే, జూన్‌లో గృహ విద్యుత్ అవసరాలు, ఇండస్ట్రియల్ లోడ్స్, అగ్రికల్చర్ లోడ్స్ తీర్చడానికి ఎలాంటి విద్యుత్ అంతరాయం లేకుండా తగిన ఏర్పాట్లు చేస్తున్నట్లు ట్రాన్స్‌కో ఎస్ఈ శంకర్ సోమవారం ప్రకటనలో తెలిపారు. సుమారు రూ.35.09 కోట్లతో ప్రణాళికలు రూపొందించామన్నారు. విద్యుత వినియోగదారులు, ఇండస్ట్రియల్ యజమానులు, రైతులతో మంగళవారం ట్రాన్స్‌కో ఎస్ఈ కార్యాలయంలో మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు సమావేశం ఏర్పాటు చేశారు. గ్రామాల్లో ఎక్కడైనా విద్యుత్ అంతరాయం జరిగితే వినతి పత్రం రూపంలో అందస్తే వెంటనే స్పందించి తగిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని వినియోగించుకొని విద్యుత్ వినియోగదారుల సమావేశానికి హాజరుకావాలని కోరారు.

ఉచితంగా గురుకుల పరీక్ష పుస్తకాల పంపిణీ

పుస్తకాలు పంపిణీ చేస్తున్న సంస్థ ప్రతినిధులు

చిన్నశంకరంపేట, ఫిబ్రవరి 3: గురుకులంలో ప్రవేశ పరీక్షకు ఉచితంగా పుస్తకాలను అందజేస్తున్నట్లు ఫౌండేషన్ వ్యవస్థాపకుడు సైంటిస్ట్ మోహన్, ప్రోగ్రాం కో ఆర్డినేటర్ శివ తెలిపారు. నేషన్స్ ఫస్ట్ హ్యూమన్ చైన్ (ఎన్ ఎఫ్‌హెచ్‌సీ) ఫౌండేషన్ వారి మిషన్ విద్య విజ్ఞాన్ సేవలో భాగంగా ఖాజాపూర్ తండా, చిన్నశంకరంపేటలో ఈ పుస్తకాలు పంపిణీ చేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో సానీక్ష ఫౌండేషన్ అధ్యక్షుడు డిశి, ఎక్స్ ఆర్మీ భాస్కర్, ట్యూషన్ నిర్వాహకులు స్వరూప, చరణ్ పాల్గొన్నారు.

నెల వ్యవధిలోనే భార్యాభర్తలు మృతి

ఆకుల జ్యోతి(ఫైల్)

చేగుట, ఫిబ్రవరి 3: నెల రోజుల వ్యవధిలోనే భార్యాభర్తలు గుండెపోటుతో మృతి చెందిన విషాద ఘటన నార్సింగి మండల కేంద్రంలో చోటు చేసుకున్నది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. నార్సింగి మండల కేంద్రానికి చెందిన ఆకుల శ్రీనివాస్ గౌడ్ గత నెల 11న గుండె పోటుతో మృతి చెందాడు. శ్రీనివాస్‌గౌడ్ భార్య జ్యోతి (50) సోమవారం గుండె పోటుతో మృతి చెందింది. భర్త, భార్య నెల రోజుల వ్యవధిలోనే గుండె పోటుతో ఇద్దరు మృతి చెందడంతో స్థానికంగా విషాదఛాయలు అలుముకున్నాయి. తన కొడుకు మృతిని తట్టుకోలేక శ్రీనివాస్‌గౌడ్ తల్లి మణెమ్మకు పక్షవాతం వచ్చింది. దీంతో ఆమె మంచానికే పరిమతమయ్యింది. మృతులకు ఇద్దరు పిల్లలు. వారు అనాథలయ్యారు.

7న హలో మాదిగ.. చలో హైదరాబాద్

నిజాంపేట, రామాయంపేటలో లక్ష డప్పులు వెయ్యి గొంతుల కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

రామాయంపేట/ నిజాంపేట/ వెల్దుర్తి/ చిలిపిచెడ్, ఫిబ్రవరి 3: ఈ నెల 7న హైదరాబాద్‌లో మందకృష్ణ మాదిగ ఆధ్వర్యంలో ఎస్సీ వర్గీకరణ కోసం తలపెట్టిన వేయి గొంతలు, లక్ష డప్పుల కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మాదిగ సంఘం నాయకులు సభకు సంబంధించిన వాల్‌పోస్టర్ సోమవారం ఆవిష్కరించారు. సుప్రీంకోర్టు తీర్పునకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణను అమలు చేయాలని డిమాండ్ చేశారు. సుప్రింకోర్టు ఆదేశించినా రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. ఎస్సీ వర్గీకరణ చేస్తామని చెప్పిన సీఎం రేవంత్‌రెడ్డి నిర్లక్ష్యం చేస్తూ మాదిగలను మోసం చేశారన్నారు. ప్రభుత్వం స్పందించి వెంటనే వర్గీకరణ చేపట్టాలని వారు డిమాండ్ చేశారు. బహిరంగ సభకు మెదక్ జిల్లా నుంచి పెద్ద ఎత్తున మాదిగలు డప్పులు సంకలో పెట్టుకుని తరలిరావాలని పిలుపునిచ్చారు.

పొలంలో పడి యువకుడు మృతి

నర్సింహులు (ఫైల్)

చేగుట, ఫిబ్రవరి 3: మూర్ఛ వ్యాధితో పొలంలో పడి యువకుడు మృతి చెందిన ఘటన మండలంలోని రెడ్డిపల్లిలో జరిగింది. గ్రామానికి చెందిన ముప్పిడి నర్సింహులు (32) తన పొలంలో సోమవారం చెనుకు మందు చల్లుతున్న సమయంలో మూర్ఛవ్యాధి వచ్చింది. దీంతో పొలంలోనే పడి మృతి చెందాడు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని, శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం రామాయంపేట ప్రభుత్వ దవాఖానకు తరలించారు. మృతుడి భార్య అనురాధ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చైతన్యకుమార్‌రెడ్డి తెలిపారు.

అదుపుతప్పి మినీ బస్సు బోల్తా

పెద్దశంకరంపేట, ఫిబ్రవరి 3: డ్రైవర్ నిద్రమత్తులో వాహనాన్ని నడపడంతో అదుపుతప్పి మినీ ట్రావెల్ బస్సు బోల్తా పడిన ఘటన పెద్దశంకరంపేట మండలం కమలాపూర్ గ్రామ శివారులోని 161వ జాతీయ రహదారిపై సోమవారం తెల్లవారు జామున జరిగింది. తెల్లవారు జామున 3 గంటల ప్రాంతంలో కర్నూల్ నుంచి నాందేడ్ వైపు వెళ్తున్న మినీ ట్రావెల్ బస్సు డీడీ 01యూ 9946 లో 17 మంది ప్రయాణిస్తున్నారు. వీరిలో ఏడుగురు గాయత్రి (37), ధనూష(7), జయశ్రీ (50) సంజు కుమార్ (57) దాహూర్ (55), డ్రైవర్ సోపాన్ స్వల్పంగా గాయపడ్డారు. వీరిని జోగిపేట ప్రభుత్వ దవాఖానకు తరలించారు. ప్రమాదానికి డ్రైవర్ నిద్రమత్తే కారణమని పోలీసులు భావిస్తున్నారు. ఘటనా స్థలానికి పోలీసులు చేరుకుని వివరాలు సేకరించారు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గృహ ప్రవేశానికి ఎమ్మెల్సీ, మాజీ ఎమ్మెల్యేలు హాజరు

గృహప్రవేశానికి హాజరైన ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి

చిన్నశంకరంపేట, ఫిబ్రవరి 3: చిన్నశంకరంపేటకు చెందిన బీఆర్ఎస్ నాయకుడు కొల్కూరి లక్ష్మారెడ్డి గృహ ప్రవేశానికి ఎమ్మెల్సీ శేరి సుభాశ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు పద్మాదేవేందర్‌రెడ్డి, శశిధర్‌రెడ్డి సోమవారం హాజరై పూజలు చేశారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీలు మాధవీ కృష్ణారెడ్డి, సుజాతా శ్రీనివాస్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రాజు, మాజీ సర్పంచ్‌లు కుమార్‌గౌడ్, ప్రభాకర్, బాగారెడ్డి, స్వామి, నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా బీరప్ప కల్యాణం


బొడ్మట్‌పల్లిలో బీరప్ప కల్యాణానికి హాజరైన మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్

టేక్మాల్, ఫిబ్రవరి 3: మండలంలోని బొడ్మట్‌పల్లిలో బీరప్ప జాతర ఘనంగా కొనసాగుతున్నది. సోమవారం బీరప్ప, కామరాతి కల్యాణ మహోత్సవాన్ని వైభవంగా జరిపించారు. ఈ కార్యక్రమానికి అందోల్ మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ హాజరై, ప్రత్యేక పూజలు చేశారు. బీఆర్ఎస్ నాయకుడు జైపాల్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు వీరప్ప, నాయకులు శ్రీనివాస్, ఈశ్వరప్ప, విఠల్, షాబోద్దిన్, గంగయ్య, రవి, సాయిబాబా, కృష్ణ, అంజయ్య, రాములు, యాదయ్య లక్ష్మయ్య, ఆంజనేయులు, రాజు, దుర్గయ్య ఉన్నారు.

వరిలో యాజమాన్య పద్ధతులు పాటించాలి

మొగి పురుగును పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

చిలిపిచెడ్, ఫిబ్రవరి 3: యాసంగి పొలాల్లో యాజమాన్య పద్ధతులు, సాగులో పాటించాల్సిన మెళకువల గురించి సంగుపేట ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు రాహుల్ విశ్వకర్మ, సరిత తెలిపారు. సోమవారం మండలంలోని చండూర్‌లో పొలాలను పరిశీలించారు. శాస్త్రవేత్తలు మాట్లాడుతూ పొలంలో అక్కడక్కడ సల్ఫైడ్ దుష్ప్రభావ లక్షణాలు ఉన్నట్లయితే, వెంటనే నీటిని తీసివేసి 1- 2 రోజుల దుబ్బుల చుట్టూ, పొలంలోని భూమికి గాలి తగిలేటట్టు చూడాలన్నారు. వరి పొలంలో చౌడు అధికంగా ఉన్న భూమిలో జింకు సల్ఫేట్ 2గ్రా. లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలన్నారు. పొలాన్ని సన్న నెర్రెలు వచ్చే వరకు ఆర పెట్టి, అప్పుడప్పుడు నీరు ఇవ్వాలన్నారు. సమావేశంలో ఏఈవో కృష్ణవేణి, రైతులు ఉన్నారు.

పాతకక్షలతో మామపై అల్లుడి దాడి

ప్రమాదంలో గాయపడి కోమాలోకి వెళ్లిన హైమద్ అలీ

రామాయంపేట, ఫిబ్రవరి 3: పాత కక్షలతో మామపై అల్లుడి వర్గం దాడికి దిగిన ఘటన రామాయంపేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని కేసీఆర్ కాలనీలో సోమవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కొన్ని రోజులుగా మామా, అల్లుడి మధ్యలో తగాదా నడుస్తున్నది. తరచూ తన బిడ్డను అల్లుడు కొట్టడంతో కాలనీకి చెందిన హైమద్‌అలీ తన కూతురును తన ఇంట్లోనే ఉంచుకున్నాడు. గతంలో పంచాయితీ పెట్టి సముదాయించినా ఫలితంలేకుండా పోయింది. తన భార్యను మామ కాపురానికి పంపడం లేదంటూ కామారెడ్డి జిల్లా భిక్కనూరు మండలం బస్వాపూర్ గ్రామానికి చెందిన అల్లుడు హనీస్‌తో బాటు మరో ముగ్గురు వ్యక్తులు విచక్షణా రహితంగా హైమద్‌అలీపై దాడి చేశారు. దీంతో అతడు కోమాలోకి వెళ్లాడు. విషయం తెలుసుకున్న రామాయంపేట పోలీసులు కాలనీకి చేరుకుని 108 అంబెలెన్స్‌లో ప్రభుత్వ దవాఖానకు తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన చికిత్సల కోసం కామారెడ్డి జిల్లా కేంద్రానికి పంపారు. దుండగులను పట్టుకునేందుకు కాలనీవాసులు చేరుకోగానే వెంటనే బైకుల మీద పారిపోయినట్లు కాలనీ వాసులు తెలిపారు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు రామాయంపేట పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రెడ్డిపల్లిలో ఉచిత పశువైద్య శిబిరం

నర్సాపూర్, ఫిబ్రవరి 3: మండలంలోని రెడ్డిపల్లి గ్రామంలో పెద్దచింతకుంట ఉప సర్పంచ్ అశోక్‌గౌడ్ ఆధ్వర్యంలో పశువైద్య శిబిరాన్ని నిర్వహించారు. జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి వెంకటయ్య మాట్లాడుతూ 22 పశువులకు గర్భకోశ వ్యాధి నివారణ చికిత్సలు, 4 పశువులకు చూడి నిర్ధారణ, 40 దూడలకు నట్టల నివారణ మందులు, 8 పశువులకు సాధారణ చికిత్సలు, 4 పశువులకు కృత్రిమ గర్భాధారణ ఇంజక్షన్లు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ జనార్దన్, వైద్యులు సౌమిత్‌కుమార్, ప్రియాంక, జూనియర్ వెటర్నరీ ఆఫీసర్ ఆంజనేయులు, గోపాల మిత్ర సూపర్‌వైజర్ సత్యనారాయణ, రామకృష్ణ పాల్గొన్నారు.

చదువుతో పాటు క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలి

కబడ్డీ పోటీలు ప్రారంభిస్తున్నన్న నాయకులు

చేగుంట, ఫిబ్రవరి 3: చదువుతో పాటు క్రీడల్లో రాణించేలా యువకులు కృషి చేయాలని నార్సింగి మాజీ జడ్పీటీసీ బాణాపురం కృష్ణారెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మైలరం బాబు తెలిపారు. నార్సింగి మండలంలోని నర్సంపల్లి పెద్దతండాలో జిల్లా స్థాయి కబడ్డీ పోటీలను సేవాలాల్ జగదాంబ దేవాలయ 14వ వార్షికోత్సవం సందర్భంగా సురేశ్, మహేష్ ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఛత్రీయనాయక్, బాష, నితిన్, చందర్, మహారాజ్, జగన్, నవీన్, మినకర్, తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

చేగుంట, ఫిబ్రవరి 3: చేగుంటకు చెందిన పూసల లక్ష్మి(భాగ్యమ్మ) అనారోగ్యంతో ఇటీవల మృతి చెందింది. బాధిత కుటుంబాన్ని జిల్లా వాలీబాల్ అసోసియేషన్ అధ్యక్షుడు పరంజ్యోతి సోమవారం పరామర్శించి, రూ.5వేల ఆర్థిక సాయం అందజేశారు.

బాధిత కుటుంబానికి అండగా ఉంటా

శివ్వంపేట, ఫిబ్రవరి 3: శివ్వంపేటకు చెందిన బొరంపేట ముత్తమ్మ అనారోగ్యంతో మృతి చెందింది. ఆ కుటుంబానికి మాజీ జడ్పీటీసీ పబ్బ మహేశ్‌గుప్తా రూ.5వేలు, నెలకు సరిపడా నిత్యావసర సరుకులను సోమవారం అందజేశారు.